నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక

రంగారెడ్డి | సంపుటి : 02 | సంచిక: 73 | పేజీలు: 4 | వెల: 4/- | శనివారం ● 05, అక్టోబర్ 2024 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి

తెలంగాణకు బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా భారీ విరాళం

హైదరాబాద్,అక్టోబర్4(నమస్తే ఉదయం): వరద బాధితుల సహాయార్థం తెలంగాణ సీఎం సహాయ నిధికి బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా రూ.1,01,75,000 విరాళం అందించింది. అసోసియేషన్ ప్రతినిధులు నర్సింహారెడ్డి, సురేందర్ పాటు ఇతర ముఖ్యులు జూబ్లీహిల్స్ నివాసంలో సీఎం రేవంత్‌ను కలిసి ఆ మేరకు చెక్కును అందించారు. వరద బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం కార్యక్రమాలకు అండగా విరాళం అందించినందుకు వారిని సీఎం అభినందించారు.

రేవంత్ రెడ్డి మోసగాడు..

- రేవంత్ రెడ్డికి రైతులు, ప్రజలు అంటే పట్టింపు లేదు
- రుణమాఫీ చేయడంలో రేవంత్ సర్కార్ విఫలం
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు
- తొర్రూరు రైతు ధర్నాలో పాల్గొన్న హరీశ్ రావు

మహబూబాబాద్,అక్టోబర్4(నమస్తే ఉదయం): పది నెలల ప్రజాపాలనలో సీఎం రేవంత్ రెడ్డికి రైతులు, ప్రజలు అంటే పట్టింపు లేదు.. ఆయన మొనగాడు కాదు మోసగాడు మిగతా.. 2లో

మూసీ ప్రక్షాళన ఎట్టి పరిస్థితుల్లో ఆగదు

- మూసీ పేరుతో జైకా నుంచి కేటీఆర్ వెయ్యి కోట్లు రుణం
- అధికారం పోగానే మూసీ ప్రక్షాళన వద్దని గగ్గోలు పెడుతున్నరు
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

హైదరాబాద్,అక్టోబర్4(నమస్తే ఉదయం): మూసీ ప్రక్షాళన ఎట్టి పరిస్థితుల్లో ఆగదని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం అసోచాం ఆధ్వర్యంలో మిగతా.. 2లో

నేడు హర్యానా పోలింగ్..

- పోలింగ్ కేంద్రాలవద్ద భారీ భద్రతా ఏర్పాట్లు

హర్యానా,అక్టోబర్4(నమస్తే ఉదయం): దేశంలో నేడు మరో రసవత్తర పోరుకు హర్యానా రాష్ట్రం సిద్ధమైంది. లోక్‌సభ ఎన్నికల తర్వాత జరుగుతున్న ఎన్నికలు కావడంతో దేశ ప్రజల చూపు హర్యానాపై ఫోకస్ మళ్లింది. ఇక్కడ కాంగ్రెస్-బీజేపీ మధ్య తీవ్ర పోటీ నెలకొంది. హర్యానాలో మొత్తం 90 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. ఒకే విడతలో అక్టోబర్ 5 (శనివారం) పోలింగ్ జరగనుంది. ఇందుకోసం అధికారులు ఏర్పాట్లు చేశారు. మిగతా.. 2లో

కేబీఆర్ పార్క్ చుట్టూ రోడ్ల విస్తరణకు గ్రీన్ సిగ్నల్

- అండర్ పాస్, ఫ్లై ఓవర్ల నిర్మానానికి అనుమతి
- క్రీడాభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ
- అంతర్జాతీయ స్థాయిలో కొత్తగా క్రీడా విధానం
- క్రీడాకారులకు మెరుగైన శిక్షణ అందించేలా స్పోర్ట్స్ వర్సిటీ
- యంగ్ ఇండియా కోచింగ్ సెంటర్ల ఏర్పాటు
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడి
- ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష

హైదరాబాద్,అక్టోబర్4(నమస్తే ఉదయం): మూసీ ప్రక్షాళన ప్రతిష్టాకంగా చేపట్టిన తెలంగాణ ప్రభుత్వం, కేబీఆర్ పార్క్ చుట్టూ రోడ్ల విస్తరణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అండర్ పాస్, ఫ్లై ఓవర్ల నిర్మానానికి అనుమతి ఇస్తూ జీవో జారీ చేసింది. మరోవైపు స్పోర్ట్స్ పాలసీపై కూడా మరింత ఫోకస్ పెంచారు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. కేబీఆర్ పార్క్ జంక్షన్ నుంచి ఐదు అండర్ పాస్ ఫ్లై ఓవర్లు, కేబీఆర్ పార్క్ చుట్టూ రేడియల్ రోడ్ల విస్తరణకు లైన్ క్లియర్ అయింది. KBR పార్క్ చుట్టూ 6 జంక్షన్ల అభివృద్ధికి రేవంత్ సర్కార్ ఆమోదం తెలిపింది. కెబిఆర్ పార్క్ ఎంట్రన్స్ నుండి.. జూబ్లీహిల్స్ చెక్ పోస్ట్, రోడ్ 45, ఫిలింనగర్, అగ్రసేన్ మహరాజ్ విగ్రహం, బసవతారకం లవైపు అండర్ పాస్ ఫ్లై ఓవర్ల నిర్మాణం చేపడుతారు. రూ.826 కోట్లతో ఆరు జంక్షన్ల అభివృద్ధి చేపట్టనున్నారు. తొలి దశలో 421 కోట్లతో ప్యాకేజీ-1లో జూబ్లిహిల్స్ చెక్ పోస్ట్..కేబీఆర్ పార్క్ ఎంట్రెన్స్ దగ్గర జంక్షన్లను అభివృద్ధి చేస్తారు.యూసఫ్‌గూడ వైపు నుంచి రోడ్డు నెం.45 జంక్షన్ వరకు రెండు లైన్ల ఫ్లైఓవర్లను నిర్మిస్తారు. కేబీఆర్ ఎంట్రెన్స్ ముగ్ధ జంక్షన్ జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు నుంచి క్యాన్సర్ హాస్పిటల్ జంక్షన్ వరకు 2 లేన్ల అండర్‌పాస్ నిర్మిస్తారు. పంజాగుట్ట వైపు నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు వరకు మూడు లేన్ల ఫ్లైఓవర్, కేబీఆర్ ఎంట్రెన్స్ జంక్షన్ నుంచి పంజాగుట్ట వైపు మూడు లేన్ల అండర్ పాస్ ఏర్పాటు చేస్తారు.405కోట్లతో ప్యాకేజీ-2లో.. రోడ్ నెం.45 జంక్షన్‌ను అభివృద్ధి చేస్తారు. రెండో దశలో రోడ్ నెంబర్ 45, ఫిల్మ్ నగర్ జంక్షన్ నుంచి జూబ్లీహిల్స్ చెక్ పోస్ట్ వైపు వరకు అండర్ పాస్ నిర్మిస్తారు. జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు నుంచి రోడ్ నెంబర్-45 వరకు రెండు లైన్ల ఫ్లైఓవర్ ఫిలింనగర్ జంక్షన్ 1, అగ్రసేన్ జంక్షన్ నుంచి రోడ్ నెం.45 జంక్షన్ వరకు 2 లైన్ల అండర్‌పాస్ అభివృద్ధి చేస్తారు. ఫిలింనగర్ జంక్షన్ నుంచి అగ్రసేన్ జంక్షన్ వరకు రెండు లైన్ల ఫ్లైఓవర్ నిర్మాణంతోపాటు మహారాజా అగ్రసేన్ జంక్షన్ 1. క్యాన్సర్ హాస్పిటల్ జంక్షన్ నుంచి ఫిలింనగర్ జంక్షన్ వరకు అండర్ పాస్ నిర్మిస్తారు. ఫిలింనగర్ జంక్షన్ నుంచి రోడ్ నెంబర్-12 వరకు రెండు లైన్ల ఫ్లైఓవర్, క్యాన్సర్ హాస్పిటల్ జంక్షన్ 1. కేబీఆర్ పార్కు నుంచి అగ్రసేన్ జంక్షన్ వరకు రెండు లైన్ల అండర్ పాస్ అభివృద్ధి చేస్తారు. అగ్రసేన్ జంక్షన్ నుంచి రోడ్డు నెంబర్-10 వరకు రెండు లైన్ల ఫ్లైఓవర్ నిర్మిస్తారు. మిగతా.. 2లో

సకాలంలో ధ్రువపత్రాలను పరిశీలించాలి

- నేటితో డీఎస్సీ ధ్రువపత్రాల పరిశీలన పూర్తిచేయండి
- జిల్లా కలెక్టర్లకు సీఎం రేవంత్ ఆదేశం
- 9,090 మంది సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి

హైదరాబాద్,అక్టోబర్4(నమస్తే ఉదయం): తెలంగాణ డీఎస్సీ జనరల్ ర్యాంకింగ్ లిస్ట్ (జీఆర్ఎల్) సెప్టెంబర్ 30న విడుదలైన సంగతి తెలిసిందే. ఫలితాలు విడుదలైన మరుసటి రోజు నుంచే అంటే అక్టోబర్ 1వ తేదీ నుంచే సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రారంభమైంది. 1:3 నిష్పత్తిలో ఎంపిక చేసిన అభ్యర్థులను ధ్రువపత్రాల పరిశీలనకు హాజరవ్వాలంటూ అభ్యర్థుల రిజిస్టర్డ్ మొబైల్ నంబర్లకు, ఈమెయిల్‌లకు విద్యాశాఖ అధికారులు ఇప్పటికే సమాచారాలు పంపించారు. ఇక ఈ ప్రక్రియను రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో అక్టోబరు 5వ తేదీలోపు పూర్తి చేయాలని కలెక్టర్లను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. సచివాలయంలో అక్టోబరు 3న ఆయన ఈ మేరకు కలెక్టర్లతో వీడియా కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ.. మొత్తం 11,062 మంది ఎంపికైన అభ్యర్థులకు అక్టోబరు 9న మిగతా.. 2లో

దద్దరిల్లిన దండకారణ్యం

- చత్తీస్‌గడ్‌లో భారీ ఎన్‌కౌంటర్
- 36 మంది మావోయిస్టుల మృతి
- నారాయణపూర్ - దంతెవాడ సరిహద్దుల్లో కాల్పుల మోత..
- పోలీసులు స్వాధీనం చేసుకున్న ఆయుధాలు

ఛత్తీస్‌గఢ్, అక్టోబర్ 04, (నమస్తే ఉదయం): దండకారణ్యం కాల్పుల మోత తో దద్దరిల్లిపోయింది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో భారీ ఎన్కౌంటర్ జరిగింది. ఈ ఘటనలో భద్రతా బలగాలు 36 మంది నక్సలైట్లను హతమార్చినట్లు సమాచారం. వివరాల్లోకి వెళితే శుక్రవారం దంతెవాడ-నారాయణపూర్ జిల్లా సరిహద్దులో పోలీసులకు, నక్సలైట్లకు మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. సెర్చ్ ఆపరేషన్‌లో ఏకే-47, ఎస్ఎల్ఆర్‌తో పాటు ఇతర ఆయుధాలను కూడా స్వాధీనం చేసుకున్నారు. అబుజ్మడ్‌లో 2 గంటల పాటు అడపాదడపా కాల్పులు జరిగినట్లు సమాచారం. అనంతరం కాల్పులు ఆగిపోవడంతో, సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ సమయంలో మృతదేహాలు, ఆటోమేటిక్ ఆయుధాలు స్వాధీనం చేసుకున్నారు. ఒక రోజు ముందుగానే, నారాయణపూర్ మరియు దంతెవాడ జిల్లాల నుండి సైనికులను నక్సల్ ఆపరేషన్‌కు పంపారు. కాగా, మధ్యాహ్నం ఒంటిగంటకు ప్రారంభమైన కాల్పులు సాయంత్రం వరకు కొనసాగిన్నట్టు తెలుస్తోంది. కేంద్ర బలగాలు, చత్తీస్‌గఢ్ పోలీసులతో కూడిన సంయుక్త కార్యాచరణ బృందం ఈ కాల్పుల్లో పాల్గొంది. ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ డివిజన్‌లో మావోయిస్టులపై సైనికుల యాంటీ నక్సల్ ఆపరేషన్ నిరంతరం కొనసాగుతోంది. ఇందులో భాగంగా శుక్రవారం (అక్టోబర్ 4) నారాయణపూర్, బీజాపూర్ పోలీసులు నక్సల్స్ వ్యతిరేక ఆపరేషన్‌లో భారీ విజయం సాధించారు. ఈ భారీ ఎన్‌కౌంటర్‌లో మంది మావోయిస్టలను సైనికులు హతమార్చారు. ఘటనా స్థలం నుంచి సైనికులు ఏకే-47, ఎస్ ఎల్ ఆర్ వంటి ఆటోమేటిక్ ఆయుధాలను, పెద్ద మొత్తంలో పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఎన్‌కౌంటర్‌లో సైనికులెవరూ మరణించినట్లు సమాచారం లేదు. పెద్ద సంఖ్యలో మావోయిస్టులు ఉన్నట్లు సమాచారం అందడంతో, స్థానిక పోలీసు బలగాలు, డిఆర్‌జి, పారామిలటరీ బలగాలు సంయుక్తంగా ఆపరేషన్ నిర్వహించి నక్సలైట్ల స్థావరంపై దాడి చేసి 30 మంది నక్సలైట్లను హతమార్చినట్లు చెబుతున్నారు.

మరణించిన మావోయిస్టుల మృతదేహాలతో శనివారం నారాయణపూర్ ప్రధాన కార్యాలయానికి భద్రతా దళాలు చేరుకుంటారని, అక్కడ గత 8 నెలల్లో 165 మంది నక్సలైట్లు వేర్వేరు ఎన్‌కౌంటర్లలో హతమయ్యారని స్థానిక పోలీసులు చెప్పారు. నారాయణపూర్, దంతేవాడ జిల్లాల సరిహద్దులో నక్సలైట్లు ఉన్నారని సమాచారం అందడంతో భద్రతా బలగాలను నక్సల్స్ వ్యతిరేక ఆపరేషన్ కోసం పంపినట్లు పోలీసు అధికారులు తెలిపారు. మిగతా.. 2లో

20 లక్షల మందికి రుణమాఫీ అందలేదు

- రుణమాఫీ కాలేదని వ్యవసాయ మంత్రే చెప్పారు
- సీఎం బండారం మరోసారి బట్టబయలైంది
- 100% రుణమాఫీ పూర్తి చేశామన్నది డొల్లమాటలే
- రాబందు ప్రభుత్వంతో రైతులకు ప్రయోజనం లేదు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శలు

హైదరాబాద్,అక్టోబర్4(నమస్తే ఉదయం): సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ట్విటర్ వేదికగా సంచలన వ్యాఖ్యలు చేశారు. 20 లక్షల మందికి రుణమాఫీ అందలేదని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించడంతో సీఎం బండారం మరోసారి బట్టబయలైందని కేటీఆర్ అన్నారు. 100% రుణమాఫీ పూర్తి చేశామన్న ముఖ్యమంత్రి డొల్లమాటలే అని మరోసారి తేలిపోయిందన్నారు. 2 లక్షల రుణమాఫీ పూర్తి చేశామన్న సన్నాసి మాటలు మోసం తప్ప మరొకటి కాదా అని ప్రశ్నించారు. మిగతా.. 2లో

కన్వీనర్ కోటా సీట్లకు వెబ్‌ఆప్షన్లు ప్రారంభం..

- అక్టోబరు 6 వరకు అవకాశం
- కాళోజీ ఆరోగ్య యూనివర్సిటీ ప్రకటన జారీ

హైదరాబాద్,అక్టోబర్4(నమస్తే ఉదయం): తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో కన్వీనర్ కోటా సీట్ల కోసం రెండో రౌండ్ కౌన్సెలింగ్ ప్రారంభమైంది. ఈ రౌండ్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు రెండో రౌండ్‌లో వెబ్‌ఆప్షన్లకు అవకాశం కల్పిస్తున్నట్లు కాళోజీ ఆరోగ్య యూనివర్సిటీ ప్రకటన జారీ చేసింది. అక్టోబరు 4 మధ్యాహ్నం నుంచి 6వ తేదీ మధ్యాహ్నం 1 గంటలోపు వెబ్‌ఆప్షన్లు ఇచ్చుకోవచ్చని మిగతా.. 2లో

అభ్యంతరాల స్వీకరణ తర్వాతే ఫలితాలు వెల్లడి

- ఈ దశలో కోర్టు జోక్యం సరికాదు
- గ్రూప్ 1పై హైకోర్టులో టీజీపీఎస్సీ వాదనలు
- గ్రూప్ 1 నోటిఫికేషన్‌పై పిటీషన్లపై విచారణ



హైదరాబాద్,అక్టోబర్4(నమస్తే ఉదయం): తెలంగాణ గ్రూప్ 1 నోటిఫికేషన్‌పై హైకోర్టులో పిటీషన్లు దాఖలైన సంగతి తెలిసిందే. 2022లో జారీ చేసిన గ్రూప్-1 నోటిఫికేషన్‌ను రద్దు చేయకుండా మరో నోటిఫికేషన్ జారీ చేయడం చెల్లదని పేర్కొంటూ జి.దామోదర్‌రెడ్డితోపాటు వికారాబాద్, యాదాద్రి, హనుమకొండ, వరంగల్ జిల్లాలకు చెందిన మిగతా.. 2లో

ధరణి పోర్టల్ రద్దు.. త్వరలో కొత్త చట్టం

- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడి

హైదరాబాద్,అక్టోబర్4(నమస్తే ఉదయం): ధరణి పోర్టల్ ను రద్దు చేసి త్వరలో ఆర్ఓఆర్ చట్టం తీసుకు వస్తామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు.ఈ నెలాఖరులోగా అమల్లోకి తెస్తామని చెప్పారు. ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా ఉండే విధంగా రూపొందించాం.. ప్రజల అభిప్రాయాలు పరిగణలోకి తీసుకుంటాం.. గత ప్రభుత్వం డబుల్ బెడ్

రూమ్స్ ను గాలికి వదిలేసింది.. పూర్తైన ఇండ్లను దసరా లోపు పేద ప్రజలకు అందజేస్తామని ఆయన వెల్లడించారు. ఇక, వెంటనే మరమ్మత్తులు మౌలిక వసతులు కల్పిస్తాం.. ప్రతి నియోజకవర్గానికి 3500 నుంచి 4 వేల ఇండ్లు మంజూరు.. ప్రతిపక్షాల సలహాలు, సూచనలు స్వీకరిస్తామని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.ఈనెల 7వ తేదీత ప్రజా ప్రభుత్వం ఏర్పాడి 10 నెలలు పూర్తి అవుతుంది అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. 10 నెలల్లో ప్రజలు కోరుకున్న వాటిని సాధించలేక పోయాం.. రాబోయే రోజుల్లో తెల్ల రేషన్ కార్డు సహా అన్ని పథకాలకు స్మార్ట్ కార్డుతో అనుసంధానం చేస్తాం.. ఈ దసరా లోపు స్మార్ట్ కార్డులు ఇస్తాం..అర్హతలను బట్టి స్మార్ట్ కార్డు ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తాం.. రాబోయే నాలుగేళ్లలో ఇందిరమ్మ ఇళ్లకు అర్హులైన ప్రతి పేదలకు ఇళ్లు ఇస్తామన్నారు. జనవరి నుంచి ఆసరా పెన్షన్లు, సన్న బియ్యం పంపిణీ చేస్తాం.. రుణ మాఫీ కానీ రైతులకు 13 వేల కోట్ల రూపాయలతో త్వరలో విడుదల చేస్తామని ఆయన వెల్లడించారు. ప్రతిపక్షాలు సొల్లు మాటలు మాట్లాడుతున్నారు.. 10 ఏళ్లలో బీఆర్ఎస్ రైతులకు ఇచ్చింది 15 వేల కోట్లు మాత్రమే.. ప్రతిపక్ష పార్టీలు పోరం బోకు మాటలు మాట్లాడుతున్నాయని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మండిపడ్డారు.

మరో 20 లక్షల మందికి త్వరలోనే రుణమాఫీ

- ఏ ఒక్క రైతు కూడా అధైర్య పడవద్దు
- రుణమాఫీ, రైతు భరోసా, రైతు బీమాను అమలు చేస్తాం
- అన్ని సబ్సిడీ పథకాలను మళ్లీ పునరుద్ధరిస్తాం
- ఖచ్చితంగా రెండు లక్షల వరకు రుణమాఫీ చేసి తీరుతాం
- రుణ మాఫీ పూర్తి చేసి రైతు భరోసా ప్రారంభిస్తాం
- రైతన్నల ఆదరణతో అధికారంలోకి కాంగ్రెస్ ప్రభుత్వం
- తుమ్మల నాగేశ్వరరావు వెల్లడి

హైదరాబాద్,అక్టోబర్4(నమస్తే ఉదయం): రుణమాఫీ గురించి పట్టించుకోని పార్టీలు ప్రస్తుతం మాట్లాడుతున్నాయని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. రైతన్నల ఆదరణతో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది.. కష్టమైనా ఒక పథకాన్ని ఆపైన సరే రుణమాఫీ, రైతు భరోసా, రైతు బీమాను అమలు చేస్తాం.. అన్ని సబ్సిడీ పథకాలను మళ్లీ పునరుద్ధరిస్తాం.. ఖచ్చితంగా రెండు లక్షల వరకు రుణమాఫీ చేసి తీరుతాం అనన్నారు. ఏ ఒక్క రైతు కూడా అధైర్య పడవద్దు అని కోరారు. అలాగే, రైతులకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ.. 25 వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశాం.. మరో 25 వేల కోట్లు రైతుల ఖాతాలోకి రావాల్సినవి ఉన్నాయి.. మరో 20 లక్షల మంది రైతులకు త్వరలో రైతు రుణ మాఫీ డబ్బులు జమ చేస్తామని ఆయన చెప్పుకొచ్చారు. రుణ మాఫీ పూర్తి చేసి రైతు భరోసా ప్రారంభిస్తామని తుమ్మల నాగేశ్వర రావు వెల్లడించారు.అలాగే, భారతదేశంలో మిగతా.. 2లో

రేవంత్ రెడ్డి మోసగాడు..

(మొదటి పేజీ తరువాయి)

అని తేలిపోయిందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు తీవ్రంగా విమర్శించారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు రైతు ధర్నాలో హరీశ్ రావు పాల్గొని ప్రసంగించారు. రుణమాఫీ చేయడంలో రేవంత్ సర్కార్ విఫలమైంది. కొమరెల్లి మల్లన్న, యాదాద్రి, భద్రాద్రి, సమ్మక్క – సారలమ్మ మీద ఒట్టు పెట్టి మొనగాడు లెక్క మాట్లాడిండు. కానీ ఇప్పుడు ఆయన మోసగాడు అని తేలిపోయింది. రైతు బంధు, రుణమాఫీ, పింఛన్లు, మహాలక్ష్మి అన్ని చేస్తా అన్నాడు. ఇప్పుడు సప్పుడు లేదు. మొత్తం రుణమాఫీ అయ్యింది రాజీనామా చేయ్ హరీష్ రావు అని సవాల్ విసిరిండు.

మరి రుణమాఫీ అయితే ఇంత మంది రైతులు ధర్నాకు ఎందుకు వచ్చారు..? పాలకుర్తి మండలంలోనే 4314 మందికి రుణమాఫీ కాలేదు అని హరీశ్‌రావు గుర్తు చేశారు. రాష్ట్రంలో 22 లక్షల మందికి మాత్రమే రుణమాఫీ అయిందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు చెప్పారు. మిగతా వారికి కాలేదు అన్నడు. చెప్పిన 22 లక్షల మందిలో కూడా కొందరికి పూర్తిగా రుణమాఫీ కాలేదు. రకరకాల కారణాలతో రుణమాఫీ ఆపే ప్రయత్నం చేస్తున్నాడు రేవంత్ రెడ్డి. 31 సాకులు పెట్టి రుణమాఫీ ఎగబెట్టే ప్రయత్నం చేస్తున్నాడు. రేవంత్ మోసగాడు అని రైతులు, ప్రజలు అంటున్నారు అని హరీశ్‌రావు తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి అబద్దాల పాలన సాగిస్తున్నారని ఆరోపించారు. ఆగష్టు 15వ తేదీలోగా రుణమాఫీ చేస్తామని అన్ని దేవుళ్లపై ఒట్టుపెట్టి మోసగాడిగా మారారని హరీష్‌రావు విమర్శించారు.

రేవంత్ రెడ్డి మొనగాడు కాదు మోసగాడు అని విమర్శించారు. 31 కుంటి సాకులు చెప్పి రేవంత్ రుణమాఫీ ఎగ్గొడుతున్నారని అన్నారు. హైడ్రా పేరుతో పేదల ఇళ్లు కూలిస్తే ఊరుకోమని

హరీష్‌రావు హెచ్చరించారు. రేవంత్ రెడ్డి దసరాలోపు రైతుబంధు డబ్బులు ఇవ్వాలని హరీష్‌రావు కోరారు.హామీలు అమలు చేసే వరకూ రేవంత్‌ను వదిలిపెట్టమని హెచ్చరించారు. ఒక్క బస్సు తప్ప రేవంత్ పాలన అంతా తుస్సేనని హరీష్‌రావు విమర్శించారు. రైతులు చనిపోయినా రేవంత్‌కు కనికరం లేదా అని ప్రశ్నించారు. ప్రజల నుంచి నిరసన వచ్చినప్పుడు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని అన్నారు. ఎమ్మెల్యేలు, మంత్రులను రైతులు నిలదీయాలని అన్నారు. రేవంత్ రెడ్డి బ్లాక్ మెయిల్ రాజకీయాలకు పాల్పడుతున్నారని విమర్శించారు.రేవంత్ రెడ్డి గుండాగిరిచేస్తే బీఆర్ఎస్ నేతలు చూస్తూ ఊరుకోరని హరీష్‌రావు వార్నింగ్ ఇచ్చారు. పాలకుర్తికి ఇద్దరు ఎమ్మెల్యేలట... అయినా అభివృద్ధి జరగడం లేదని హరీష్‌రావు విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి ఓ బ్లాక్ మెయిలర్, అబద్దాలకోరు అని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు విమర్శలు చేశారు. ఇవాళ (శుక్రవారం) తొర్రూరులో ఎర్రబెల్లి దయాకర్ రావు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ మహాధర్నా చేపట్టింది. ఈ ధర్నాలో బీఆర్ఎస్ నేతలు హరీష్‌రావు, సత్యవతి రాథోడ్, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మధుసూదనాచారి, మాలోతు కవిత, రుణమాఫీ కానీ రైతులు, బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దయాకరరావు మాట్లాడుతూ... సీఎం అయ్యాక రేవంత్‌రెడ్డి అబద్దాలు ఎక్కువ మాట్లాడుతున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్‌ను ఎందుకు ఓడించామని ప్రజలు బాధపడుతున్నారని అన్నారు. రుణమాఫీ చేసేదాక వదిలిపెట్టామని ఎర్రబెల్లి దయాకర్ రావు హెచ్చరించారు.

మూసీ ప్రక్షాళన ఎట్టి పరిస్థితుల్లో ఆగదు

(మొదటి పేజీ తరువాయి)

హెచ్ఐసీసీ నోవాటెల్ లో జరిగిన "అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సమ్మిట్ 2024" కు ముఖ్య అతిథిగా హాజరై ప్రతిపక్ష పార్టీల ద్వంద్వ విధానాలపై మండిపడ్డారు.మూసీ పేరుతో జైకా నుంచి వెయ్యి కోట్లు రుణం తీసుకున్న కేటీఆర్, అధికారం పోగానే మూసీ ప్రక్షాళన వద్దని గగ్గోలు పెడుతున్నారని ఆరోపించారు.

మూసీ పరివాహక ప్రాంతంలోని ప్రజలు తీవ్ర ఆరోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతుంటే, రాజకీయాలు తగదని ప్రతిపక్షాలకు సూచించారు.స్థిరమైన మౌళిక వసతుల నిర్మాణం, రాష్ట్ర సుస్థిరాభివృద్ధి కోసం ప్రగతిశీల నిర్ణయాలు తీసుకుంటున్నామని, గత పదేండ్ల తెలంగాణ విధ్వంసాన్ని సరిదిద్దేందుకు అహర్నిశలు శ్రమిస్తూ, సమ్మిళిత, సుస్థిరాభివృద్ధి లక్ష్యాలవైపు సాగుతున్నామని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా వేగంగా విస్తరిస్తున్న అర్బన్ కల్చర్‌కు అనుగుణంగా తెలంగాణలో కూడా పట్టణీకరణ జరగవలసిన ఆవశ్యకత ఉందని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు.

అందుకోసం కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం భవిష్యత్ సవాళ్ళను ఎదుర్కొనేందుకు, అభివృద్ధికి బలమైన పునాదులు వేయడంతో పాటు రాష్ట్ర ముఖ చిత్రాన్ని మార్చేసేందుకు అనేక మౌళిక సదుపాయాలను నిర్మిస్తున్నదని వివరించారు. హైదరాబాద్ దశ దిశను మార్చేందుకు తమ ప్రభుత్వం కంకణం కట్టుకుందని చెప్పిన మంత్రి, అందులో భాగంగానే రోడ్లు, ఆర్ఓబీలు, ఆర్‌యూబీలు, కొత్త లింక్ రోడ్లు నిర్మించడం వంటి కీలకమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నదని చెప్పారు. అంతేకాకుండా అర్బన్ ఏరియాల్లో ఘన వ్యర్థాల నిర్వహణ సవాల్‌తో కూడుకున్నదని చెప్పిన మంత్రి, అందుకోసం ఎస్‌టీపీలు నిర్మించి మెరుగైన మురుగు నీటి వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం ఓఆర్ఆర్ పరిధిలో దాదాపు 40 శాతం జనాభా నివసిస్తుందని, ఇది 2028 నాటికి 50 శాతం దాటే అవకాశం ఉందన్నారు. అందుకు అనుగుణంగా పట్టణ విస్తరణ, మౌళిక వసతులను కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తమ మంత్రుల బృందమంతా కలిసి మౌలిక సదుపాయాల కల్పనను వేగవంతం చేసేందుకు స్పీడ్ (స్మార్ట్, ప్రొయాక్టివ్,ఎఫీషీయంట్,ఎఫెక్టివ్ డెలివరీ) వంటి ప్రణాళికలతో 19 ప్రాజెక్టులను వేగవంతంగా పూర్తిచేసేందుకు ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. హైదరాబాద్ అభివృద్ధి కోసం ఇప్పటికే బడ్జెట్‌లో రూ.10,000 కోట్లు కేటాయించడమే కాకుండా, ప్రపంచంలో అత్యంత నివాసయోగ్యమైన నగరంగా మార్చడానికి అనేక ప్రణాళికలతో ముందుకు సాగుతున్నామని వివరించారు కోమటిరెడ్డి.

అభ్యంతరాల స్వీకరణ తర్వాతే ఫలితాలు వెల్లడి

(మొదటి పేజీ తరువాయి)

మరో అయిదుగురు ఈ పిటీషన్లను దాఖలు చేశారు. అంతేకాకుండా తాజాగా నిర్వహించిన గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్ష ప్రాథమిక కీలో తప్పులున్నాయని, వాటిని సవరించాలన్న అభ్యంతరాలను పట్టించుకోకపోవడాన్ని సవాల్ చేస్తూ పలువురు అభ్యర్థులు రెండు వేర్వేరు పిటిషన్‌లు దాఖలు చేశారు. వీటిపై జస్టిస్ పుల్లా కార్తీక్ గురువారం విచారణ చేపట్టారు.

విచారణ సమయంలో ప్రభుత్వం తరపు న్యాయవాది కీలక విషయాలను ధర్మాసనానికి తెలియజేశారు. గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్షల కీపై అభ్యంతరాలు స్వీకరించామని, వాటిని ఆయా సబ్జెక్ట్‌ల వారీగా నిపుణుల కమిటీకి పంపి, వారు ఆమోదించిన తర్వాతే ఫలితాలు విడుదల చేసినట్లు టీజీపీఎస్సీ హైకోర్టుకు నివేదించింది. మెయిన్స్ క్వాలిఫై అయిన వారికి త్వరలో మెయిన్స్ పరీక్షలు జరగనున్నాయని తెలిపింది. ఈ దశలో కోర్టులు జోక్యం చేసుకోరాదని, దీనివల్ల అభ్యర్థులకు తీవ్ర నష్టం కలుగుతుందని ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది రాహుల్‌రెడ్డి, టీజీపీఎస్సీ తరఫున ఎం రాంగోపాల్‌రావులు వాదనలు వినిపించారు.

గ్రూప్ 1 పరీక్షలు రాసిన 3 లక్షల మంది నుంచి ప్రిలిమ్స్ కీపై భౌతికంగా 721, ఆన్‌లైన్ ద్వారా 6,470 అభ్యంతరాలు వచ్చినట్లు న్యాయవాదులు తెలిపారు. వాటిని నిపుణుల కమిటీ పరిశీలించి, కొన్ని సిఫార్సులు చేసింది. వీటిని పరిగణనలోకి తీసుకుని రెండు ప్రశ్నలను తొలగించి కీని విడుదల చేశామని వివరించారు. ప్రస్తుతం పిటిషన్ దాఖలు చేసిన ఐదుగురిలో ఒక్కరే కమిషన్‌కు అభ్యంతరాలు తెలియజేసినట్లు తెలిపారు. మిగిలినవారు ఎలాంటి అభ్యంతరాలు వ్యక్తం చేయకుండా కోర్టును ఆశ్రయించారన్నారు. రెండోసారి నోటిఫికేషన్ జారీని సవాల్ చేసిన అభ్యర్థితో పాటు కీని సవాల్ చేసిన పిటిషనర్లలో ముగ్గురు మెయిన్స్‌కు అర్హత సాధించినట్లు వెల్లడించారు. ప్రశ్నలకు విశ్లేషణాత్మకంగా ఆలోచించి సమాధానం ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ఒకరిద్దరికి అర్థం కానంత మాత్రాన అవి తప్పులైనట్లు కాదన్నారు.

పరీక్షలను నిష్పాక్షికంగా నిర్వహిస్తున్నామని, ఈ పిటిషన్‌లను కొట్టివేయాలని న్యాయమూర్తిని కోరారు. అయితే గురువారం కోర్టులో వాదనలు పూర్తికాకపోవడంతో తదుపరి విచారణను అక్టోబరు 4కి వాయిదా వేశారు.

శుక్రవారం ఇరువర్గాల వాదనలు విన్న తర్వాత కోర్టు అంతిమ నిర్ణయం ఏం చెబుతుందనేది వేచి చూడాలి.

కేబీఆర్ పార్క్ చుట్టూ రోడ్ల విస్తరణకు గ్రీన్ సిగ్నల్

(మొదటి పేజీ తరువాయి)

ఇప్పటికే పరిపాలన అనుమతులు వచ్చేశాయి. ఇన పనుల వేగవంతమే తరువాయి. అండర్ పాస్ ఫ్లై ఓవర్లు ,రేడియల్ రోడ్లతో కేబీఆర్ ఏరియా రూపురేఖలు ఇక మరో లెవల్‌గా మారనున్నాయి. మరోవైపు నగరాభివృద్ధి సహా అటు క్రీడాభివృద్ధిపై కూడా ఫోకస్ పెట్టారు సీఎం రేవంత్ రెడ్డి. హైదరాబాద్‌ను అంతర్జాతీయ క్రీడా వేదికగా తయారు చేయడం సహా క్రీడాకారులకు మరింత ప్రొత్సాహం అందించాలనే లక్ష్యంతో స్పోర్ట్స్ పాలసీపై దృష్టిసారించారు సీఎం. క్రీడాకారులకు మెరుగైన శిక్షణ అందించేలా స్పోర్ట్స్ వర్సిటీ , యంగ్ ఇండియా కోచింగ్ సెంటర్లను ఏర్పాటు చేస్తామన్నారు. దక్షిణ కొరియా కోచ్‌లో శిక్షణ ఇప్పిస్తామన్నారు. చెప్పడమే కాదు స్పోర్ట్స్ పాలసీపై ఫుల్‌గా ఫోకస్ చేశారు సీఎం రేవంత్ రెడ్డి. అద్భుతమైన క్రీడాకారులను తీర్చిదిద్దటంతో పాటు అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణకు గుర్తింపు తెచ్చేలా కొత్త క్రీడా విధానం తయారు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. 2036 ఒలింపిక్స్‌ను దృష్టిలో పెట్టుకొని కొత్త పాలసీలో లక్ష్యాలను నిర్దేశించుకోవాలని చెప్పారు. కొత్త స్పోర్ట్ పాలసీ ముసాయిదాపై ముఖ్యమంత్రి రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు కె.కేశవరావు , ఏపీ జితేందర్ రెడ్డి , తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనా రెడ్డి , ఉన్నతాధికారులతో సమావేశమై సమీక్షించారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు వివిధ దేశాలు, ఇతర రాష్ట్రాలు అనుసరిస్తున్న

విధానాలను ప్రధానంగా చర్చించి పలు సూచనలు చేశారు.రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా నెలకొల్పనున్న స్పోర్ట్స్ యూనివర్సిటీని యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీ గా తీర్చిదిద్దాలని అన్నారు. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ తరహాలోనే స్పోర్ట్స్ యూనివర్సిటీని పీపీపీ తరహాలో నిర్వహించాలని సూచించారు. ప్రత్యేకంగా బోర్డు ఏర్పాటు చేసి చైర్మన్‌ను నియమించాలి. యూనివర్సిటీకి స్వయం ప్రతిపత్తి ఉండాలన్నారు. ఈ యూనివర్సిటీలో క్రికెట్, హాకీ, ఫుట్‌బాల్, బాస్కెట్ బాల్, స్విమ్మింగ్, టెన్నిస్, బ్యాడ్మింటన్, షూటింగ్, బాక్సింగ్, రెజ్లింగ్, టేబుల్ టెన్నిస్, అథ్లెటిక్స్, జిమ్నాస్టిక్స్, అక్వాటిక్స్ లాంటి 14 క్రీడలను స్పోర్ట్స్ హబ్‌లో చేర్చాలని అన్నారు.

దాదాపు 70 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న గచ్చిబౌలి స్పోర్ట్స్ స్టేడియం ప్రాంగణంలో స్పోర్ట్స్ యూనివర్సిటీని ప్రారంభించాలని చెప్పారు. హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియం, హకీంపేట స్పోర్ట్స్ స్కూల్, కోట్ల విజయ భాస్కరరెడ్డి ఇండోర్ స్టేడియం, సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం, ఓయూలోని వెలోడ్రోమ్ ప్రముఖ క్రీడా మైదానాలు, స్టేడియంలు అన్నింటినీ ఒకే గొడుకు కిందకు తెచ్చి స్పోర్ట్ హబ్‌గా మార్చాలని అన్నారు,. తెలంగాణ భౌగోళిక పరిస్థితులతో పాటు ఇక్కడి యువతకు ఆసక్తి ఉన్న క్రీడలకు ప్రాధాన్యమివ్వాలి. శిక్షణకు దేశ విదేశాల్లో ఉన్న కోచ్‌లను రప్పించాలని ఆదేశించారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన క్రీడాకారులకు ఇచ్చే ప్రోత్సాహకాలకు స్పష్టమైన విధానాన్ని రూపొందించాలని అధికారులకు సూచించారు.

సకాలంలో ధ్రువపత్రాలను పరిశీలించాలి

(మొదటి పేజీ తరువాయి)

ఎల్‌బీ స్టేడియంలో నియామక పత్రాలు అందించేందుకు వీలుగా జిల్లాల్లో వేగంగా ధ్రువపత్రాల పరిశీలన పూర్తి చేయాలని అన్నారు. అందుకు తగిన విధంగా సకాలంలో ధ్రువపత్రాలను పరిశీలించాలని సూచించారు. ఇప్పటికే 9,090 మందికి సర్టిఫికెట్ల పరిశీలన పూర్తయిందని విద్యాశాఖ అధికారులు ముఖ్యమంత్రికి తెలియజేశారు.ముఖ్యమంత్రితో నిర్వహించిన ఈ సమావేశంలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశంతోపాటు పాఠశాల విద్యాశాఖ సంచాలకుడు ఈవీ నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా ధ్రువపత్రాల పరిశీలన నేటితో ముగియనుంది. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అన్నీ జిల్లాల్లోని ఆయా కేంద్రాల్లో ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియకు అభ్యర్థులు హాజరుకావల్సి ఉంటుంది. మార్కులు, రోస్టర్ పాయింట్ల ఆధారంగా ఎంపిక చేసిన అభ్యర్థులకు ఈ ప్రక్రియ రేపటితో ముగుస్తుంది. ఇప్పటికే ఈ జాబితాలు అధికారిక వెబ్‌సైట్‌తోపాటు, డీఈఓ వెబ్‌సైట్లలోనూ అందుబాటులోకి తీసుకొచ్చారు. అభ్యర్థులు డీఈఓలు గుర్తించిన కేంద్రాల్లో ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు రెండు సెట్ల ఫొటో కాపీలతో హాజరుకావల్సి ఉంటుంది. అంతా సక్రమంగా జరిగితే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించినట్లు ఈ నెల 9వ తేదీన నియామక పత్రాలు అందజేసే అవకాశం ఉంది.

ముగ్గురు సీఐలు, 13 మంది ఎస్ఐలపై వేటు

హైదరాబాద్,అక్టోబర్4(నమస్తే ఉదయం): తెలంగాణలో పోలీసుల ప్రక్షాళన మొదలైంది. అక్రమ దాదులను దుర్వినియోగం చేస్తున్న పోలీసు అధికారులపై వేటు పడింది. మల్టీజోన్-2లోని తొమ్మిది జిల్లాల్లో అక్రమ ఇసుక రవాణాను అరికట్టడంలో విఫలమైన ముగ్గురు సీఐలు, 13 మంది ఎస్ఐలను వీఆర్‌వోలుగా కొనసాగిస్తూ మల్టీజోన్-2 ఐజీపీ వి.సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. వీఆర్‌లో పెట్టినవారిలో సంగారెడ్డి రూరల్, తాండూరు రూరల్, తాండూరు టౌన్ సీఐలతో పాటు వీపనగండ్ల, బిజినేపల్లి, తెలకపల్లి, వంగూరు, ఉప్పునూతల, సంగారెడ్డి రూరల్, పెద్దేముల్, యాలాల్, తుంగతుర్తి, ఆత్మకూర్(ఎస్), పెన్‌పహాడ్, వాడపల్లి, హాలియా ఎస్ఐలుగా ఉన్నారు. ఇసుక అక్రమ రవాణాకు ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరిస్తున్న కొందరిపై శాఖాపరమైన చర్యలు తీసుకున్నట్లు ఐజీ తెలిపారు. త్వరలో వారిని లూప్‌లైన్‌కు బదిలీ చేయనున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే ఒక సీఐ, 14 మంది ఎస్సైలు బదిలీ అయిన సంగతి తెలిసిందే.ప్రధానంగా ఇసుక అక్రమ రవాణా వల్ల ప్రభుత్వానికి గండి పడుతుంది. అదేవిధంగా వాగులు, నదీ ప్రాంతాల్లో ఇసుక దందా యథేచ్ఛగా సాగుతోంది. అదేవిధంగా పర్యావరణ సమతుల్యత దెబ్బతినే అవకాశం ఉందని ప్రభుత్వం, రాష్ట్ర డీజీపీ సీరియస్‌గా ఉన్నారని ఐజీ తెలిపారు. ఇప్పటికే నేరస్తులతో పనిచేసిన ఆదివాదేవిపల్లి, వేములపల్లి, నారత్‌పల్లి, చండూరు, మాడుగులపల్లి, తిప్పర్తి, చింతలపాలెం, తిరుమలగిరి, నాగారం, జాజిరెడ్డిగూడెం, అచ్చంపేట, బొంరాస్‌పేట, తండు ఆర్, చిన్నంబావి ఎస్సైలను ఐజీ బదిలీ చేశారు. పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాపై తదుపరి చర్యలు తీసుకుంటామని ఐజీ హెచ్చరించారు. దీనిపై ఇప్పటికే రహస్య విచారణ జరుగుతోందని తెలిపారు.

స్థానికంగానే కాకుండా అంతర్రాష్ట్రానికి కూడా పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాకు పాల్పడుతున్న ప్రధాన నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీలను ఐజీ సత్యనారాయణ ఆదేశించారు. పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా, అక్రమ ఇసుక రవాణా, జూదం, మట్కాను పూర్తిగా నిషేధించాలి. పేకాట, మట్కా ఆడితే సంబంధిత పోలీసు అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇప్పటికే వికారాబాద్ మర్పల్లిలోని ఓ గెస్ట్ హౌస్ లో పేకాట నడుపుతున్న ప్రభాకర్ సాలే, రఫీక్ లకు ఐజీ సత్యనారాయణ సీరియస్ వార్నింగ్ ఇచ్చారు. రఫీపై సస్పెక్ట్ షీట్ ఓపెన్ చేశారు.ఇదిలావుంటే బాధ్యతాయుతంగా ప్రవర్తించాల్సిన పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని ఐజీ సత్యనారాయణ అన్నారు. ఈ క్రమంలో వికారాబాద్ సర్కిల్ ఇన్ స్పెక్టర్ పై వేటు వేశారు. సీఐ నాగరాజును సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మైనర్ బాలికపై లైంగికదాడికి పాల్పడిన కేసులో విచారణలో నిర్లక్ష్యం, అక్రమాలకు పాల్పడిన జోగిపేట స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఎ.నాగరాజుపై సస్పెన్షన్ వేటు పడింది.

నేడు హర్యానా పోలింగ్..

(మొదటి పేజీ తరువాయి)

ఇక పోలింగ్ సిబ్బంది ఈవీఎంలను తీసుకుని పోలింగ్ స్టేషన్లకు చేరుకుంటున్నారు. ఇక ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. హర్యానాలో కాంగ్రెస్-బీజేపీ పోటాపోటీగా ప్రచారం చేశాయి. మరొకసారి అధికారం కోసం బీజేపీ కృషి చేయగా.. అధికారం ఛేజిక్కించుకోవాలని కాంగ్రెస్ శాయశక్తులా ప్రయత్నం చేసింది. అలాగే ఆప్ కూడా కొన్ని స్థానాల్లో పోటీ చేస్తోంది. కొన్ని స్థానాల్లో ఆమ్ ఆద్మీ పార్టీ కూడా ప్రభావం చూపించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రధాని మోడీ, అమిత్ షా, రాహుల్ గాంధీ, మల్లిఖార్జున ఖర్గే లాంటి ముఖ్యమైన నేతలంతా ప్రచారంలో దూసుకుపోయారు. రెండు పార్టీలు కూడా మాటల తూటాలు పేల్చుకున్నారు. ఇక భారత రెజ్లర్ వినేష్ ఫోగట్ ఎన్నికల బరిలోకి దిగారు. కాంగ్రెస్ నుంచి జులానా నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా నిలబడ్డారు.ఇక హర్యానా ఎన్నికలు ముగియగానే ఎగ్జిట్స్ పోల్స్ విడుదల కానున్నాయి. జమ్మూకాశ్మీర్‌లో మూడు విడతలగా పోలింగ్ జరిగింది. సెప్టెంబర్ 18, 25, అక్టోబర్ 1న ప్రశాంతంగా ఓటింగ్ ముగిసింది. ఇక్కడ భారీగానే ఓటింగ్ నమోదైంది. శనివారం సాయంత్రం 5 గంటల తర్వాత హర్యానా, జమ్మూకాశ్మీర్ ఎగ్జిట్ పోల్స్ విడుదల కానున్నాయి. మరీ ఈసారి ప్రజలు ఎవరికీ అధికారం కట్టబెట్టనున్నారో చూడాలి.

దద్దరిల్లిన దండకారణ్యం

(మొదటి పేజీ తరువాయి)

ఇప్పటి వరకు 36 మంది మావోయిస్టులు హతమయ్యారని, వారి సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. ఘటనా స్థలం నుంచి భారీ సంఖ్యలో ఆటోమేటిక్ ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. ఎన్‌కౌంటర్ కొనసాగుతోంది. ఇరువైపులా కాల్పులు కొనసాగుతున్నాయి. ఈ విషయాన్ని

దంతెవాడ ఎస్పీ గౌరవ్ రాయ్ ధృవీకరించారు. మావోయిస్టుల ఉనికి గురించి సమాచారం ఉన్న ప్రదేశానికి భద్రతా దళాలు మధ్యాహ్నం ఒంటి గంటకు చేరుకున్నప్పుడు, మావోయిస్టులు కాల్పులు ప్రారంభించారని దంతెవాడ ఎస్పీ చెప్పారు. ఘటన అనంతరం భద్రతా బలగాలు కూడా ఎదురు కాల్పులు జరిపాయని పోలీసు అధికారులు తెలిపారు. నారాయణపూర్, దంతేవాడ జిల్లాలకు చెందిన ఉమ్మడి బలగాలకు, నక్సలైట్లకు మధ్య ఎన్‌కౌంటర్ కొనసాగుతోందని చెప్పారు. ఆ ప్రాంతంలో అడపాదడపా కాల్పులు జరుగుతున్నాయి. ఎన్‌కౌంటర్‌లో భద్రతా దళాలంతా సురక్షితంగా ఉన్నట్లు సమాచారం అందిందని అధికారులు తెలిపారు. దీనికి సంబంధించి మరింత సమాచారం ఆరా తీస్తున్నారు. బస్తర్ ప్రాంతంలోని సుక్మా జిల్లాలో గురువారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో భద్రతా దళాలు మావోయిస్టుల తాత్కాలిక శిబిరాన్ని కూల్చివేసి, భారీ మొత్తంలో పేలుడు పదార్థాలు, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నాయి.

మరో 20 లక్షల మందికి త్వరలోనే రుణమాఫీ

(మొదటి పేజీ తరువాయి)

ఎక్కువ పంటలను సాగు చేసే ఏకైక రాష్ట్రం తెలంగాణ అని మంత్రి తుమ్మల తెలిపారు. మన రాష్ట్రంలో ఒక కోటి 45 లక్షల టన్నుల వరి ధాన్యం పండిస్తున్నాం.. ఏ ఒక్క రైతు ఇబ్బంది పడకుండా సీఎం రేవంత్ రెడ్డి కష్టపడుతున్నాడు.. ఈ సీజన్లో రైతులు ఎక్కువగా సన్న ధాన్యాన్ని పండించారు.. 500 రూపాయలు అదనంగా ఇచ్చి సన్న ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ను అధికారంలోకి తేవడానికి పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ప్రధాన పాత్ర పోషించారు అని తుమ్మల నాగేశ్వర్ రావు తెలిపారు. భవిష్యత్ లో కాంగ్రెస్ కు మంచి భవిష్యత్ ఉండాలనే మహేష్ కు పీసీసీ పదవి ఇచ్చింది.. రాష్ట్రంలో ఈ సీజన్ లో కోటి 43 లక్షల టన్నుల ధాన్యం పండుతుంది.. దేశంలోనే ఇది అత్యధిక దిగుబడి.. రైతులు ఎన్ని సన్నాలు పండించిన 500 బోనస్ ఇచ్చి కొనుగోలు చేస్తాం.. రాష్ట్రంలోని అన్ని జిల్లాలో ఆయిల్ ఫాల్ ఫ్యాక్టరీల ఏర్పాటుకు కృషి చేస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు చెప్పుకొచ్చారు.

కన్వీనర్ కోటా సీట్లకు వెబ్‌ఆప్షన్లు ప్రారంభం..

(మొదటి పేజీ తరువాయి)

ప్రకటనలో తెలిపింది. ఇక కన్వీనర్ కోటా కింద మొదటి రౌండ్‌లో సీట్లు పొందిన విద్యార్థులు అక్టోబరు 4వ తేదీ మధ్యాహ్నం ఒంటిగంటలోపు కేటాయించిన మెడికల్ కాలేజీలో చేరాల్సి ఉంటుందని యూవర్సిటీ పేర్కొంది. మరోవైపు మేనేజ్‌మెంట్ కోటా కింద మొదటి దశ కౌన్సెలింగ్‌లో ఎంబీబీఎస్ సీట్లను దక్కించుకున్న విద్యార్థుల వివరాలను కూడా కాళోజీ ఆరోగ్య యూనివర్సిటీ గురువారం ప్రకటించింది. కాలేజీల వారీగా అడ్మిషన్లు పొందిన విద్యార్థుల వివరాలను వెబ్‌సైట్‌లో అందుబాటులోకి తీసుకొచ్చారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి ఆర్మీ కేటగిరీ కన్వీనర్ కోటా సీట్ల ప్రాధాన్య క్రమాన్ని సైనిక్ వెల్ఫేర్ బోర్డు ప్రకటించింది. దరఖాస్తు చేసుకున్న వారిలో 447 మంది అర్హత సాధించారు. 31 మందికి సరైన పత్రాలు లేవని వెల్లడించింది. మొత్తంగా 478 మంది అభ్యర్థుల ప్రాధాన్య క్రమాన్ని విజయవాడ డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య యూనివర్సిటీకి అందించింది. ఈ మేరకు హెల్త్ వర్సిటీ తాజా ప్రకటన విడుదల చేసింది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) బ్యాంకుల్లో 1511 పోస్టులకు ఆన్‌లైన్ దరఖాస్తు గడువు పెరిగింది. గతంలో ఇచ్చిన ప్రకటన మేరకు అక్టోబర్ 4వ తేదీతో తుది గడువు ముగియనుంది. తాజా ప్రకటనతో ఆన్‌లైన్ దరఖాస్తులకు అక్టోబర్ 14వ తేదీ వరకు అవకాశం ఇస్తున్నట్లు ఎస్‌బీఐ ప్రకటించింది. ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకోని వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించింది.

20 లక్షల మందికి రుణమాఫీ అందలేదు

(మొదటి పేజీ తరువాయి)

రాబందు ప్రభుత్వం ఉంటే రైతులకు ఎలాంటి ప్రయోజనం లేదని, రేవంత్ అసమర్థత ధాన్యం దాతలకు కోలుకోలేని శాపమని కేటీఆర్ ట్వీట్ చేశారు. ఒకవైపు డిసెంబర్ 9న ఏకకాలంలో చేస్తామని మాయమాటలు చెప్పి.. మరోవైపు 10 న



గవర్నర్‌కు జ్ఞాపకం అందజేస్తున్న భాగ్యలక్ష్మి ట్రస్టీ శశికళ

చార్మినార్ భాగ్యలక్ష్మి వారిలో దర్శించుకున్న తెలంగాణ రాష్ట్ర గవర్నర్ దంపతులు

చార్మినార్, అక్టోబర్ 4(నమస్తే ఉదయం):
తెలంగాణ రాష్ట్ర గవర్నర్ దంపతులు చారిత్రక చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారు దర్శించు కొన్నారు. శుక్రవారం శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు భాగంగా జరుగుతున్న భాగ్యలక్ష్మి అమ్మవారి నవరాత్రి ఉత్సవాలలో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ దంపతులు అమ్మవారిని దర్శించుకుని ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ట్రస్టీ శశికళ గవర్నర్ దంపతులకు జ్ఞాపకను అందజేశారు.

ప్రజా సమస్యలపై సిపిఎం నిరంతరం పోరాటం

- పార్టీ మండల కమిటీ కార్యదర్శి కురుమయ్య

రాజేంద్రనగర్, అక్టోబర్ 4(నమస్తే ఉదయం):
ప్రజా సమస్యలపై సిపిఎం నిరంతరం పోరాడుతుందని ఆ పార్టీ రాజేంద్రనగర్ మండల కమిటీ కార్యదర్శి జి.కుర్మయ్య అన్నారు. శుక్రవారం సిపిఎం శాఖ కార్యదర్శి ఎన్ జంగయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో. సిపిఎం పార్టీ మండల కార్యదర్శి. జి.కురుమయ్య పాల్గొన్నారు. ఈ

సందర్భంగా కురుమయ్య మాట్లాడుతూ... పార్టీ సభ్యులు కార్మికుల పక్షాన నిలబడి పనిచేయాలనివిజ్ఞప్తి చేశారు, ఎర్రజెండా అందులో సిపిఎం పార్టీ అంటే అడుగు బలహీన వర్గాలకు పేద ప్రజలకు కార్మికులకు. అండగా ఉండి పని చేస్తుందని అన్నారు సిపిఎం పార్టీలో సభ్యులుగా ఉండడం అంటే ఎంతో గౌరవం అని ఆ గౌరవాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.. సమావేశంలో శాఖ కార్యదర్శి ఎన్ జంగయ్య, విజయ, యాదయ్య,శ్రీలత, చిట్టెమ్మ ,అనిత, సావిత్రి ,యాదమ్మ, తదితరులు పాల్గొన్నారు.

తన కూతురు శ్రేయ రెడ్డి వివాహ వేడుకలకు మాజీ సీఎం కేసీఆర్‌ను ఆహ్వానించిన ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి

మల్కాజ్ గిరి, అక్టోబర్ 4(నమస్తే ఉదయం):
మల్కాజిగిరి శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి, మమతా రెడ్డి దంపతులు తన కూతురు శ్రేయ రెడ్డి వివాహానికి మాజీ సీఎం కేసీఆర్ ను మాజీ మంత్రి మల్లారెడ్డి తో కలిసి వివాహ ఆహ్వాన పత్రాన్ని అందజేసే ఆహ్వానించారు.

మాజీ సీఎం కేసీఆర్‌కు తన కూతురు వివాహం ఆహ్వానం పత్రికను అందజేస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, మాజీమంత్రి మల్లారెడ్డి

ఈ నెల 27 వ తేదీన జరగనున్నతన ఏకైక కూతురు మర్రి శ్రేయా రెడ్డి, ఆదిత్య రెడ్డిల వివాహానికి హాజరై వదు వరులను ఆశీర్వదించాలని తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కే.సి.ఆర్ కి వివాహ ఆహ్వాన పత్రికను మాజీ మంత్రి మల్లారెడ్డితో కలిసి అందజేశారు. గౌరవ మల్కాజిగిరి శాసన సభ్యులు శ్రీ మర్రి రాజశేఖర్ రెడ్డి, మర్రి మమత రెడ్డి దంపతులు.

గాంధీ నగర్‌లో ఇంద్రారెడ్డి జయంతి వేడుకలు

పేదల పెన్నిధి స్వర్గీయ మాజీ హెూం శాఖ మంత్రి ఇంద్రారెడ్డి : పి జీవన్ దాస్

రాజేంద్రనగర్, అక్టోబర్ 4(నమస్తే ఉదయం):
అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం కృషిచేసి పేదల పెన్నిధిగా హృదయాలలో నిలిచిపోయారని దళితనేత పి జీవన్ దాస్ అన్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని గాంధీ నగర్ లో స్వర్గీయ మాజీ హెూం శాఖ మంత్రి ఇంద్రారెడ్డి 69వ జయంతి వేడుకల సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పచ్చ శ్రీనివాస్, డి.ఉమారెడ్డి, నవీన్, నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

రూ.3.51 కోట్ల కరెన్సీ నోట్లతో ధనలక్ష్మి అలంకారంలో అమ్మవారు

గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 4(నమస్తే ఉదయం):
దేవీ శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా రెండో రోజైన శుక్రవారం గద్వాలలోని ప్రముఖ ఆలయాల్లో కొలువుదీరిన అమ్మవార్లు ధనలక్ష్మి దేవిగా దర్శనమిచ్చారు.

గద్వాల పట్టణంలోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో దేవీ నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు.

శుక్రవారం అమ్మవారు ధనలక్ష్మి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. దాదాపు రూ.3.51 కోట్ల కరెన్సీ నోట్లతో అమ్మవారి ఆలయాన్ని పాలకవర్గం ముస్తాబు చేశారు. 500, 200, 100, 50, 20, 10 రూపాయల కొత్త నోట్లతో కన్యకా పరమేశ్వరి అమ్మవారి సుందరంగా తీర్చిదిద్దారు

దేవి శరన్నవరాత్రిలో భాగంగా గద్వాల పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారిని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి సతీమని బండ్ల జ్యోతి దర్శించుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ నరహరి శ్రీనివాసులు, ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు ఆలూరు రామయ్య శెట్టి, మహిళా అధ్యక్షురాలు మధుమతి, నాయకులు రామకృష్ణ శెట్టి, ధర్మ నాయుడు, హను మంతయ్య శెట్టి, ఆర్యవైశ్య సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పత్తి కొనుగోలుకు కేంద్రాలు ఏర్పాటు చేయండి :కలెక్టర్ సంతోష్

గద్వాల జిల్లా ప్రతినిధి అక్టోబర్ 4 (నమస్తే ఉదయం):
పత్తి కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులు పండించిన పత్తిని సజావుగా కొనుగోలు చేసే విధంగా విస్తృత ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ బి.ఎం. సంతోష్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో పత్తి కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై సంబంధిత అధికారులతో సన్నాహక సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో పత్తి కొనుగులు కేంద్రాల వద్ద అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ సీజన్ లో జిల్లావ్యాప్తంగా 1.29 లక్షల విస్తీర్ణంలో పత్తి సాగు చేయడం జరిగిందన్నారు. ఎకరాకు 10 క్వింటాళ్ల చొప్పున దాదాపు 12.91 పత్తి దిగుబడి వచ్చే అవకాశం ఉందని అంచనా వేయడం జరిగిందని అన్నారు. ఇందుకు గాను అలంపూర్‌లో ఒక పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. రైతులు తమ పండించిన పత్తికి మద్దతు ధర అందాలంటే కచ్చితంగా తేమ శాతం 8-12 ఉండేటట్లు చూసుకోవాలన్నారు. నాణ్యమైన మేలు రకం పత్తికి కనీస మద్దతు 7 వేళ521 కాగా, మామూలు పత్తికి రూ. 7వేల121 చొప్పున చెల్లించడం జరుగుతుందని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సేకరించిన పత్తిని ఎప్పటికప్పుడు గోదాములకు తరలించాలని, సీసీఐ ద్వారా రైతులకు వెంటనే డబ్బులు చెల్లించే విధంగా చూడాలన్నారు. ఈ మాసంతం వరకు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా మార్కెటింగ్ అధికారి పుష్పమ్మ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సక్రియ నాయక్, సీసీఐ కమర్షియల్ అధికారి రోహన్ దుబే వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన పేదల నాయకుడు ఇంద్రన్న

ఇంద్రారెడ్డి వారసత్వాన్ని స్వీకరించి ప్రజా సేవలో కొనసాగుతున్నాం

ప్రజాహితమే ఇంద్రారెడ్డి జీవితాశయం : బిఆర్ఎస్ యువనేత కార్తీక్ రెడ్డి

రాజేంద్రనగర్, అక్టోబర్ 4(నమస్తే ఉదయం):
అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేసిన స్వర్గీయ మాజీ హెూం శాఖ మంత్రి ఇంద్రారెడ్డి ఆశయాల కోసం ఆయన వారసత్వాన్ని స్వీకరించి ఆయన సతీమణి సబితా ఇంద్రారెడ్డి, తనయునిగా కార్తీక్ రెడ్డిని ముందుకు వెళుతున్నామని భారత్ రాష్ట్ర సమితి యువ నేత, ఇంద్రారెడ్డి మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ పి కార్తీక్ రెడ్డి అన్నారు. శుక్రవారం రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని డైరీ ఫారం చివరస్తాలో సీనియర్ నాయకులు సుభాష్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన స్వర్గీయ ఇంద్రారెడ్డి 69వ జయంతి వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ... స్వర్గీయ ఇంద్రారెడ్డి రంగారెడ్డి జిల్లా ప్రజల్లో చిరస్థాయిగా నిలవడంతో పాటు తెలంగాణ ఉద్యమాన్ని రెండోసారి తెరపైకి తెచ్చి ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనకు శ్రీకారం చుట్టాలన్నారు. ఇంద్రారెడ్డి ఆశయాల కోసం మాజీ మంత్రి మహేశ్వరం శాసన సభ్యురాలు సబితా ఇంద్రారెడ్డి నిరంతరం ప్రజల్లో ఉంటూ ప్రజాహితమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నారన్నారు. నేటి స్వార్థ రాజకీయాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ప్రజల ముందుకు తీసుకెళ్తూ ప్రజా సంక్షేమం కోసం నిరంతరం పోరాడుతామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ ఎస్ వెంకటేష్, సీనియర్ నాయకులు పోరెడ్డి ధర్మారెడ్డి, జాలిగం చిత్తారి, సోమా శ్రీనివాస గుప్తా, ముఖీద్ చంద్, అక్కెం రాఘవేందర్ యాదవ్, నోముల రాము యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కరాటే అభ్యసించడంతో ఆత్మవిశ్వాసం, శారీరక దారుఢ్యం అభివృద్ధి:కరాటే గ్రాండ్ మాస్టర్ బాలిశ్వర్

రాజేంద్రనగర్, అక్టోబర్ 4(నమస్తే ఉదయం):
కరాటే అభ్యసించడం ద్వారా ఆత్మవిశ్వాసం, శారీరక దారుఢ్యం అభివృద్ధివారియర్స్ కరాటే గ్రాండ్ మాస్టర్ బాలిశ్వర్ అన్నారుచెందుతాయని వారియర్స్ కరాటే గ్రాండ్ మాస్టర్ బాలిశ్వర్ అన్నారు. శుక్రవారం ఆప్కో కాలనీలోని నూతనంగా వారియర్స్ కరాటే క్లాస్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలేశ్వర్ మాట్లాడుతూ... ప్రస్తుత పరిస్థితులలో పిల్లలంతా మొబైల్ ఫోన్లకు అలవాటు పడుతున్నారని అన్నారు. దీని కారణంగా వారి ఆలోచన శక్తి బలహీనమై అవకాశం ఉందన్నారు. కరాటే శిక్షణ ద్వారా విద్యలోనూ రాణించడానికి అవకాశం ఉంటుందని చెప్పారు. ఆప్కో కాలనీలో యాదవ్ భవన్ లో ప్రతిరోజు 6 నుంచి 7:30 వరకు కరాటే శిక్షణను కృష్ణ మాస్టర్ నిర్వహిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన కరాటే ప్రదర్శన పలువురిని ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు మసన వెంకటేష్ యాదగిరి, గంజి వెంకటేష్, రాము యాదవ్, ఎల్లప్ప, సోమయ్య, నరేందర్, రవి, సూర్య కిరణ్, కరాటే మాస్టర్లు, విక్రమ్, మల్లేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

కరాటే శిక్షణ పొందు తున్న చిన్నారులు, కరాటే శిక్షణ తరగతుల ప్రారంభోత్సవంలో స్థానిక నాయకులు

నేడు విద్యుత్ సరఫరాల అంతరాయం

రాజేంద్రనగర్, అక్టోబర్ 4(నమస్తే ఉదయం): గగన్ పహాడ్ విద్యుత్ సెక్షన్ పరిధిలోని ఇందిరా గాంధీ హౌసింగ్ సొసైటీ విద్యుత్ సబ్స్టేషన్ పరిధిలో గల ప్రాంతాలైన ఇందిరాగాంధీ హౌసింగ్ సొసైటీ పారి ప్రాథమిక వాడ, మధుబన్ వాటర్ ట్యాంక్ ప్రాంతం లలో శనివారం మధ్యాహ్నం 12 గంటల నుండి 12:30 వరకు, కాటేదాన్ విద్యుత్తు సబ్ స్టేషన్ పరిధిలోని రవి ఫుడ్ కంపెనీ, రామ్ చరణ్ ఆయిల్ మిల్ ప్రాంతాలలో శనివారం ఉదయం 11:30 నుండి 12 గంటల వరకు, శాతం రాయి పారిశ్రామికవాడ విద్యుత్ ఫీడర్ పరిధిలోని ప్రాంతాలైన శాతం రాయి పారిశ్రామిక వాడ ప్రాంతాలలో ఉదయం 11:30 నుండి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాల అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ జుబేరుద్దీన్ తెలిపారు.

మైలార్ దేవ్పల్లి విద్యుత్ సెక్షన్ పరిధిలో...

మైలార్ విద్యుత్తు సెక్షన్ పరిధిలో శనివారం వివిధ మరమత్రా నిమిత్తం ఉదయం 10:30 నుండి 11 గంటల వరకు వినాయక నగర్ కొంత భాగం, సుభాన్ కాలనీ, ఫేస్ వన్ ఫేస్ టు, మిలాన్ కాలని, హశామాబాద్, దస్తగిరి నగర్, పల్లె చెరువు విద్యుత్తు ఫీడర్ పరిధిలో ఉదయం 11:30 నుండి 12 గంటల వరకు ఆలీనగర్ , ఆహమ్మద్ నగర్, ఇండస్ట్రియల్ ఏరియా, తమిళ్ బస్తి ప్రాంతాలు, బండ్లగూడ విద్యుత్ ఫీడర్ పరిధిలో వివిధ మరల నిమిత్తం శనివారం మధ్యాహ్నం ఒంటిగంట నుండి ఒకటిన్నర వరకు వినాయక నగర్, ఆలీనగర్, అహ్మద్ నగర్, ప్యాలెస్ వ్యూ కాలనీ,కింగ్స్ ఎవెన్యూ ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో

అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ శ్రీనివాస్ తెలిపారు.

హిమాయత్ సాగర్ విద్యుత్ సెక్షన్ లో...

హిమాయత్ సాగర్ విద్యుత్ సెక్షన్ పరిధిలో వివిధ మరల నిమిత్తం శనివారం విద్యుత్ సరఫరాల్లో అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ శ్రీనివాస్ తెలిపారు. రిసెప్షన్ పరిధిలో శనివారం ఉదయం 11 గంటల నుండి 11:30 వరకు పి అండ్ టి కాలనీ విద్యుత్ ఫీడర్ పరిధిలో పి అండ్ టి కాలనీ, ఏ బి సి డి, స్పెషల్ బ్లాక్, లలో ఉదయం 11:30 నుండి 12 గంటల వరకు హైదర్ షాకోట్ విద్యుత్ ఫ్రీడమ్ పరిధిలో గల ప్రాంతాలైన వెంకటేశ్వర కాలనీ, డైమండ్ వ్యాలీ, ప్రశస్త నగర్, తిరుమల గార్డెన్, రాధా థియేటర్స్, ఫేస్ టు, పావని హార్మోని విల్లాస్, బచ్పన్ స్కూల్, పద్మశ్రీ హిల్స్, ప్రాంతాలలో మధ్యాహ్నం 12 నుండి 12:30 వరకు గంధం కూడా వ్యక్తి సబ్స్టేషన్ పరిధిలో గల ప్రాంతాలైన పద్మశ్రీ హిల్స్ భాగ్యనగర్ కాలనీ రాధ నగర్ కేకే 3 రాధ నగర్ ఫేస్ 1 హీరా కాలనీ ఇంద్రారెడ్డి కాలనీ ప్రాంతాలలో మధ్యాహ్నం 12:30 నుండి 1:00 వరకు గంధంగూడ విద్యుత్ సబ్స్టేషన్ పరిధిలో గల ప్రాంతాలైన హిమగిరి కాలనీ గంధంగూడ, హైదర్ షా కోర్ట్ విలేజ్ ,సన్ సిటీ, జీన్స్ సల్బర్గ్, వెస్ట్ ఎండ్ కాలనీ ప్రాంతాలలో వివిధ మరమ్మతులు చెట్లు కొమ్మలు తొలగించ డానికి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ శ్రీని వాస్ తెలిపారు ఈ విద్యుత్తు అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

యువతరానికి ఆదర్శప్రాయుడు ఇంద్రారెడ్డి: పట్లోళ్ల కార్తిక్ రెడ్డి

శంషాబాద్, అక్టోబర్ 4(నమస్తే ఉదయం): కార్మిక. విద్యాశాఖ. హోం శాఖ మంత్రిగా ఇంద్రారెడ్డి ఈ ప్రాంతానికి చేసిన సేవలు చిరస్మరణీయంగా నిలిచి ఉంటాయని ఆయన కుమారుడు టిఆర్ఎస్ పార్టీ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జ్ పట్లోళ్ల కార్తిక్ రెడ్డి పేర్కొన్నారు. ఇంద్రారెడ్డి 70వ జయంతి సందర్భంగా శనివారం శంషాబాద్ మండలం పాలమాకుల గ్రామంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఇంద్రారెడ్డి తన రాజకీయ చతురతతో ఎంతోమంది కొత్త తరం నాయకులను సృష్టించారని సామాన్యులను సైతం నాయకులుగా తీర్చిదిద్దారని ఆయన పేర్కొన్నారు.

ఈ ప్రాంత అభివృద్ధి కోసం నిస్వార్థంగా కృషిచేసిన ఇంద్రారెడ్డి సహాయ సహకారాలతో అనేకమంది రాజకీయ నాయకులుగా ఎదిగారని తెలిపారు. ప్రతి గ్రామంలో ఇంద్రారెడ్డి చేసిన అభివృద్ధి కనిపిస్తుందని వివరించారు. ఇంద్రారెడ్డి లేని లోటు తీర్చలేనిదని కార్తీక్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ శ్రవణ్ గౌడ్. శంషాబాద్ మాజీ ఎంపీపీ దిద్యాల జయమ్మ శ్రీనివాస్. మాజీ జెడ్పిటిసి బూర్కుంట సతీష్. టిఆర్ఎస్ పార్టీ నాయకులు చక్రధర్ రెడ్డి. రాజేందర్. వెంకట్ రెడ్డి. గౌస్ పాషా. శ్రీశైలం యాదవ్.



పాలమాకుల శ్రీనివాస్ రెడ్డి. హనుమంతు ముదిరాజ్. గూడెపు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టులో వైద్య రక్తదాన శిబిరం

హైదరాబాద్, అక్టోబర్ 4(నమస్తే ఉదయం): హైకోర్టు ఆవరణలో నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ, న్యూఢిల్లీ ఆధ్వర్యంలో తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ, ఉస్మానియా జనరల్ హాస్పిటల్ , నిర్మాణ్ ఆర్గనైజేషన్ (NGO) సహకారంతో వైద్య శిబిరం, రక్తదాన శిబిరాన్ని తెలంగాణ హైకోర్టు చీఫ్ జస్టిస్ జస్టిస్ అలోక్ ఆరాధే ప్రారంభించారు.

వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న హైకోర్టు చీఫ్ జస్టిస్ అలోక్ అరాదే

శుక్రవారం తెలంగాణ రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవల అథారిటీ ల పోషకుడు-ఇన్-చీఫ్ "మల్టీ స్పెషాలిటీ హెల్త్ క్యాంప్, రక్తదాన శిబిరాన్ని" నిర్వహించారు .

జస్టిస్ సుజోయ్ పాల్, న్యాయమూర్తి, తెలంగాణ రాష్ట్రానికి హైకోర్టు , ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్, తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవల అథారిటీ జస్టిస్ అభినంద్ కుమార్, షావలి, తెలంగాణ రాష్ట్రానికి హైకోర్టు న్యాయమూర్తి హైకోర్టు ఛైర్మన్ లీగల్ సర్వీసెస్ కమిటీ అతిథిగా విచ్చేశారు. ఈ శిబిరానికి తెలంగాణ రాష్ట్ర హైకోర్టులోని సహచర న్యాయమూర్తులు హాజరయ్యారు. తెలంగాణ బార్ కౌన్సిల్ ఆఫ్ తెలంగాణ చైర్మన్ ఎ. నరసింహా రెడ్డి, తెలంగాణ హైకోర్టు అడ్వకేట్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎ. రవీందర్ రెడ్డి, హైదరాబాద్ లోని ఉస్మానియా జనరల్ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ రాకేష్ కుమార్ సహాయ్, నిర్మాణ్ ఫౌండర్ , సిఇఒ మయూర్ పట్నాల , సంస్థ ఈ శిబిరానికి ప్రత్యేక ఆహ్వానితునిగా హాజరయ్యారు.

ఈనెల 6న ఐకాన్ లెజెండ్ అవార్డు గ్రహీత మాజీ శాసన సభ్యుడు పాపారెడ్డికి సన్మానం

గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 4(నమస్తే ఉదయం): రాయచూరు మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో ఈనెల 6న ఐకాన్ లెజెండ్ అవార్డు గ్రహీత రాయచూరు మున్నూరు కాపు సమాజం ముంగారు ఉత్సవాల రాయబారి, మాజీ శాసనసభ్యుడు ఎ.పాపారెడ్డికి రాయ చూరులోని శ్రీవీరాంజనేయ స్వామి కళ్యాణ మండపంలో సన్మాన కార్యక్రమం నిర్వహిస్తు న్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు బెల్లం నర్సిరెడ్డి, ప్రధాన కార్యదర్శి జి.బసవరాజారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ వి.కృష్ణమూర్తి పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... సెప్టెంబర్ 22న సికింద్రాబాద్లో జరిగిన దక్షిణ భారత మున్నూరు కాపు సమాజం లీడర్ గ్లోబల్ సమ్మిట్లో ఆయన ఐకాన్ లెజెండ్ అవార్డును అందుకున్నారని తెలిపారు.

రాయచూరులో గత జూన్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక ఎద్దుల రాతి దూలం పోటీలను ఏర్పాటు చేసి మన పూర్వీకుల సంప్రదాయాలను పిల్లలకు పరిచయం చేసేందుకు ముంగారు మున్నూరు కాపు సంబరాలు నిర్వహిస్తున్న సందర్భంగా ఐకాన్ లెజెండ్ అవార్డుతో సన్మానించడం జరిగిందన్నారు.

ఈ నేపథ్యంలో ఈనెల 6న రాయచూరు జిల్లా కేంద్రంలోని శ్రీవీరాంజనేయ స్వామి కళ్యాణ మండపంలో నిర్వహించు సన్మాన కార్యక్రమానికి రాయచూరు, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాల మున్నూరు కాపు సంఘం కులస్తులు తరలిరావాలని పిలుపునిచ్చారు.

శ్రీ బాలత్రిపుర సుందరీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చిన శ్రీ అంబభవాని మాత

కొత్తకోట, అక్టోబర్ 4(నమస్తే ఉదయం): కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలో కొలువైన అత్యంత మహిమాన్వితురాలైనశ్రీ భవాని శంకర దేవాలయంలో దేవినవరాత్రులలో భాగంగా రెండవరోజు అమ్మవారు శ్రీ బాలాత్రిపుర సుందరీ దేవిగా అలంకరించి భక్తులకు దర్శనిచ్చారు.

శుక్రవారం ఉదయం అధికసంఖ్యలో భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శివాలయంలో అభిషేఖాలు నిర్వహించిన అనంతరం అమ్మవారికి భక్తులు తెచ్చిన చీర,సారె, పలహారాలను భక్తితో అమ్మవారికి సమర్పించి కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించారు.

నవరాత్రులలో రెండవరోజు పూర్తి స్థాయి అన్నదాతగా విశ్వమోహన్ చారి దంపతులు అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రజా పంపిణీ బియ్యం అక్రమ రవాణకు సహకరించిన కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేసిన జిల్లా ఎస్పీ టి. శ్రీనివాస రావు

గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 4(నమస్తే ఉదయం): జోగుళాంబ గద్వాల్ జిల్లా ఐజ పోలీస్ స్టేషన్లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న ఆర్.కృష్ణయ్య(పిసి 2258) బాధ్యతారహితంగా వ్యవహరిస్తూ పి డి ఎస్ బియ్యం అక్రమంగా రవాణా చేసే వారికి సహకరిస్తున్నారన్న సమాచారం మేరకు విచారణ చేపట్టగా ఈ విషయం బుజువైనందున పై చర్య టిఎస్ సి రూల్స్ ప్రకారం నిబంధనలకు విరుద్ధంగా ఉన్నందున శాఖపరమైన క్రమశిక్షణ చర్యల్లో భాగంగా పోలీసు కానిస్టేబుల్ కృష్ణయ్య ను జిల్లా ఎస్పీ టి.శ్రీనివాస రావు సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

పోలీసు అధికారుల పనితీరును, సమాజంలో వారి ప్రవర్తనను పోలీస్ శాఖ నిశితంగా పరిశీలిస్తుందని, పోలీస్ శాఖలో పనిచేస్తూ ఇలాంటి చర్యలను ఎవరు చేసినా ఉపేక్షించేది లేదని జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు తెలియజేశారు.

కాంగ్రెస్ పార్టీది కూలగొట్టే అరాచక పాలన

ప్రజలే మంచి, చెడు నిర్ణయిస్తారు

బీఆర్ఎస్ పుట్టిందే తెలంగాణ కోసం..

కేసీఆర్‌ది నిర్మాణాత్మక ఆలోచన

మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి

సూర్యాపేట,అక్టోబర్4(నమస్తేఉదయం): బీఆర్ఎస్ పుట్టిందే తెలంగాణ కోసం..కేసీఆర్‌ది నిర్మాణాత్మక ఆలోచన, కాంగ్రెస్ పార్టీది కూలగొట్టే అరాచక పాలన అని సూర్యాపేట మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ సభ్యత్వ బీమా, సీఎం ఆర్ఎఫ్ చెక్కులు), ఎల్వోసీలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఇల్లు ఇస్తారని నమ్మి ఓట్లేస్తే ఉన్న ఇల్లు కూలగొట్టే పరిస్థితి దాపురించిందన్నారు. రైతు భరోసా లేదు, ఉన్న రైతుబంధు ఇస్తలేరు. అభివృద్ధి చేతకాకనే అరాచకాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. హామీలను గలికొదిలేసి అభివృద్ధిని ఆటకెక్కించారు. ప్రజల సమస్యలు పట్టకపోగా.. వాళ్లే ఇబ్బందులకు గురిచేస్తున్నరు.. అభివృద్ధి చేసిందెవరో, ఆగం చేస్తున్నదెవరో ప్రజలంతా గమనిస్తున్నరు. హంస పాలను, నీళ్లను వేరు చేసినట్లు ప్రజలే మంచి, చెడు నిర్ణయిస్తారు. కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటున్న ఏకైక పార్టీ బీఆర్ఎస్ మాత్రమేనన్నారు. పార్టీ సభ్యత్వ బీమాతో కార్యకర్తల కుటుంబాలకు అండగా నిలుస్తున్నామని స్పష్టం చేశారు.

నేడు తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం, బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన దీక్ష

హైదరాబాద్,అక్టోబర్4(నమస్తే ఉదయం): నేడు ఉ"9.00 గం"ల నుండి సా" 5.00 గం"ల వరకు గోదావరిఖని చౌరస్తానందు నిరసన దీక్ష సింగరేణి ఉద్యోగులకు 2023-2024 సంవత్సరంలో సంస్థ మొత్తంగా రూ.4,701 కోట్ల నికర లాభం సమకూరింది. ఇందులో సంస్థ విస్తరణ పెట్టుబడులకు రూ.2.289 కోట్లు కేటాయించగా మిగిలిన రూ.2,412 కోట్లు. ఇందులో 33% అనగా రూ.796 కోట్లను కార్మికులకు బోనస్ గా ప్రకటించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 16.9% మాత్రమే 41,387 సింగరేణి కార్మికులకు తీవ్ర అన్యాయం చేయడం జరిగిందని తెలిపారు. 2022-2023 సంవత్సరంలో నికర మొత్తం లాభం రూ.2.222 కోట్ల లాభం రాగా ఇందులో 32% రూ.711 కోట్ల రూపాయలను బోనస్ గా ప్రకటించినారు. భారత రాష్ట్ర సమితి అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రివర్యులు గౌ"శ్రీ" కల్వకుంట్ల చంద్రశేఖర రావు గారు. మరియు తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం. రాష్ట్ర అధ్యక్షులు గౌ"శ్రీ, మిర్యాల రాజి రెడ్డి గారు నిర్ణయంతో. 2023-2024 సంవత్సరంలో రూ.4.701 కోట్ల రూపాయల నుండి 33% ఇవ్వాలని డిమాండ్ చేస్తూ గోదావరిఖని చౌరస్తాలోని భారత రాష్ట్ర సమితి పార్టీ నిర్ణయంతో తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు శ్రీ"మిర్యాల రాజి రెడ్డి ఆధ్వర్యంలో నిరసన దీక్ష చేపట్టడం జరుగుతుంది.

ఈ కార్యక్రమానికి మాజీ మంత్రివర్యులు కొప్పుల ఈశ్వర్ . పెద్దపెల్లి జిల్లా అధ్యక్షులు రామగుండం మాజీ శాసనసభ్యులు కోరుకంటి చందర్ . మంచిర్యాల జిల్లా అధ్యక్షులు చేన్నూరు మాజీ శాసనసభ్యులు బాల్క సుమన్ . మంచిర్యాల మాజీ శాసనసభ్యులు నడిపెల్లి దివాకర్ రావు , బెల్లంపల్లి మాజీ శాసనసభ్యులు దుర్గం చిన్నయ్య. పెద్దపల్లి జిల్లా మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ మంథని మాజీ శాసనసభ్యులు పుట్ట మధుకర్ మరియు తెలంగాణ బొగ్గుగనీ కార్మిక సంఘం 11 డివిజన్లో సెంట్రల్ కమిటీ నాయకులు, బ్రాంచ్ కమిటీ నాయకులు ఫిట్ కమిటీ నాయకులు టీబీజీకేస్ ముఖ్య నాయకులు సింగరేణి ఉద్యోగులు బిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయవలసిందిగా కోరారు.

అనర్హతకు గురైన నియోజక వర్గాల్లో ఉపఎన్నికలు

బీఆర్ఎస్ నేత బాల్క సుమన్ సంచలన వ్యాఖ్యలు

హైదరాబాద్,అక్టోబర్4(నమస్తే ఉదయం): తెలంగాణలో ఉపఎన్నికల అంశం తరుచూ వినిపిస్తోంది. కొన్ని నియోజకవర్గాలకు ఉపఎన్నికలు ఖాయమని బీఆర్ఎస్ నేతలు పదే పదే చెబుతున్నారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి జంప్ అయిన ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో బైపోల్స్ జరుగుతాయనేది గులాబీ నేతల మాట. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలు అనర్హతకు గురై ఆయా నియోజకవర్గాల్లో ఉపఎన్నికలు రావడం ఖాయమని అంటున్నారు. అనర్హత కారణంగా ఉప ఎన్నికలు జరిగే నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ గెలుపు తథ్యమని ఆ పార్టీ నేతలు స్పష్టం చేస్తున్నారు. తాజాగా చెన్నూరు నియోజకవర్గానికి సంబంధించి బీఆర్ఎస్ నేత బాల్క సుమన్ సంచలన వ్యాఖ్యలు చేశారు.

Printed and Published MEKALA DAMODAR REDDY on behalf of VANITHA Publications, and Printed at Vanitha Graphics, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy,Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: M.Damodhar Reddy. "RNI. Title- Code: TELTEL/2023/87699**. Cell: 9492148733